## క్లుప్తంగా

### 9లోపు విద్యుత్ బిల్లులు ఇవ్వాలి

చిత్తూరు కార్పొరేషన్: ప్రతి నెలా 9వ తేదీలోపు విద్యుత్ బిల్లులు ఇవ్వాలని ట్రాన్స్‌కో అర్బన్ ఈఈ మునిచంద్ర తెలిపారు. డివిజన్‌లోని అన్ని సర్వీసులకు రీడర్స్ బిల్లులను నిర్ణీత తేదీలోపు ఇవ్వాలని ఆదేశించారు. తుపాను నేపథ్యంలో విద్యుత్ పునరుద్ధరణ పనులను సకాలంలో చేపడుతున్నామన్నారు. ఎక్కడ వాటర్ వర్క్స్‌కు ఇబ్బందులు లేకుండా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. సబ్‌స్టేషన్ వారీగా ఫీడర్లను లైన్ ఇన్‌స్పెక్టర్లు పరిశీలిస్తుండాలని వివరించారు. విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా చేయడానికి కృషి చేస్తున్నమన్నారు. సెక్షన్ల వారీగా విధిగా ట్రీ కటింగ్ చేస్తుండాలని సూచించారు. డివిజన్‌లో ట్రాన్స్‌ఫార్మర్లను దశలవారీగా ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

### ఎయిడ్స్‌పై ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

తవణంపల్లె: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం వైద్యాధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారులు డాక్టర్ మోహన్‌వేలు, కేశవనారాయణ, వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య బృందం ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ అంటువ్యాధి కాదు అంటించుకునే వ్యాధి అని, ఎయిడ్స్ వ్యాధికి నివారణ ఒక్కటే మార్గమని చెప్పారు. నిరోధ్ వాడండి-నిశ్శబ్దాన్ని ఛేదించండి అనే నినాదాలతో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓలు సుబ్రమణ్యం, రాజామణి, పీహెచ్ఎస్ భారతి, ఆరోగ్య పర్యవేక్షకులు, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాకార్యకర్తలు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

### ఆటో డ్రైవర్లకు జరిమానాలు


ఆటోలకు జరిమానా విధిస్తున్న వన్‌టౌన్ సీఐ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో నిబంధనలు పాటించని ఆటో డ్రైవర్లకు పోలీసులు జరిమానాలు విధించారు. సోమవారం వన్‌టౌన్ సీఐ జయరామయ్య స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. పలువురు ఆటో డ్రైవర్లు ఎక్కడిపడితే అక్కడ ఆటోలను ఆపేసి, ప్రయాణికులను ఎక్కించుకోవడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందని పోలీసులకు ఫిర్యాదులు అందాయి. దీంతో నిబంధనలు ఉల్లంఘించిన ఆటోలను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. రికార్డులు లేనివారికి జరిమానాలు విధించారు.

### 60 మందికి వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: గ్రామీణులు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ కోరారు. ఆయన సోమవారం మండలంలోని 35 యర్లంపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 60 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. చలికాలంలో ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

### పండ్ల పరిశ్రమల సమస్యలు పరిష్కరించాలి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న పండ్ల సమాఖ్య నాయకులు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని పండ్ల పరిశ్రమల నిర్వాహకుల సమస్యలను పరిష్కరించాలని పండ్ల పరిశ్రమల సమాఖ్య జిల్లా కార్యదర్శి కట్టమంచి బాబి కోరారు. ఈ మేరకు ఆ సమాఖ్య నాయకులు సోమవారం కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చిత్తూరులో ఏర్పాటు చేయాలనుకున్న ఇంగ్లాండ్ కంటైనర్ డిపోను త్వరితగతిన ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఆ కంటైనర్ డిపో ఏర్పాటు చేస్తే వేలాది మంది స్థానికులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. గత ప్రభుత్వంలో డిపోకు అవసరమైన భూమిని కేటాయించినట్లు చెప్పారు. ఆ తర్వాత చేపట్టాల్సిన కసరత్తును ప్రత్యేక చొరవతో చేపడితే వేలాది మందికి మేలు జరుగుతుందన్నారు. స్పందించిన కలెక్టర్ డిమాండ్లను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పండ్ల సమాఖ్య నాయకులు తలపలపల్లి బాబు రెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, సమీర్ శర్మ, సోమశేఖర్ లు పాల్గొన్నారు.

## చివరికి చింతే!


బంగారుపాళెం: ముంగరమడుగు వద్ద నేలవాలిన వరి పంట

బంగారుపాళెం: ఫెంగల్ తుపాను ప్రభావంతో మండలంలో కురిసిన వర్షాలకు కోతదశలో ఉన్న వరి పంట నేలకొరిగింది. అందులో మొలకలు వచ్చేశాయి. వర్షానికి పలు గ్రామాల్లో కోతదశలో ఉన్న వరి పంట నేల వాలినట్లు వ్యవసాయాధికారి చిట్టిబాబు తెలిపారు. ఇప్పటి వరకు 12 మంది రైతులకు చెందిన వరి పంటలు దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు. మండలంలో 250 హెక్టార్లలో రైతులు వరి సాగు చేశారన్నారు. 90 శాతం కోతలు పూర్తి అయ్యాయన్నారు. తుపాను కారణంగా కోతదశలో ఉన్న పంట పొలాల్లో ఉండడం వల్ల వర్షానికి నేల వాలి మొలకెత్తిందని రైతులు వాపోతున్నారు. పంట నష్టం తప్పదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేలవాలిన పంటను ఒబ్బిడి చేసుకునేందుకు అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయని అంటున్నారు. కూలీలతో కోయించాలంటే లాచా ఖర్చు అవుతుందని బాధిత రైతులు చెబుతున్నారు. ఎంత కష్టపడినా రైతుకు చివరికి చింతే మిగిలింది.


పొలంలో మొలకెత్తిన వరి

# హై రోడ్డు విస్తరణకు సర్వే!

- కోర్టు భవనం నుంచి గిరింపేట వరకు
- వంద అడుగుల విస్తరణ ప్రతిపాదనలు
- పరిహారం స్థానంలో.. టీడీఆర్ బాండ్లు అందజేత
- నెలాఖరులోపు ముగియనున్న సర్వే.. ఆపై పనులు

చిత్తూరు అర్బన్: నగరంలో రోడ్ల విస్తరణ అంశం మరోమారు తెరపైకి వచ్చింది. గతంలో కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారిగా పనిచేసిన నాగేంద్ర.. అప్పట్లో సంతపేట రోడ్డు విస్తరించడంలో చాకచక్యంగా వ్యవహరించారు. ఎవరికీ ఎలాంటి పరిహారం ఇవ్వకుండా బాధితులను స్వచ్ఛందంగా ఒప్పించి పనులు చేపట్టడంలో అన్ని వర్గాల నుంచి సానుకూలత లభించింది. ఇటీవల ఆయన కార్పొరేషన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ)గా బాధ్యతలు తీసుకున్నారు. దీంతో ఇప్పుడు హైరోడ్డు విస్తరణ చేయాలని పాలకులు చెప్పడంతో ఆ దిశగా అడుగులు వేస్తుండడం నగర అభివృద్ధిపై స్థానికుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. సోమవారం రోడ్డు విస్తరణపై సర్వే, మార్కింగ్‌ను ప్రారంభించారు.

**మాస్టర్ ప్లాన్ అమలు**

మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో ప్రతి 20 ఏళ్లకోసారి మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో 2022లో నూతన మాస్టర్ ప్లాన్ అమల్లోకి వచ్చింది. ఇది 20 ఏళ్ల పాటు అమల్లో ఉంటుంది. ఈ ప్లాన్ ప్రకారం నగరంలోని రోడ్లను వంద అడుగులకు విస్తరించాలనే ప్రతిపాదన ఉంది. ప్రధానంగా కట్టమంచి రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి కలెక్టరేట్ కూడలి వరకు వంద అడుగుల వెడల్పుతో రోడ్డును విస్తరించాలనే ప్రతిపాదనలు మాస్టర్ ప్లాన్‌లో ఉన్నాయి. దీంతో మున్సిపల్ యంత్రాంగం మాస్టర్ ప్లాన్ అమలు చేయాలని నిర్ణయించింది.

**50 అడుగుల మేర విస్తరణ**

తాజాగా అధికారులు జిల్లా న్యాయస్థానాల సముదాయం నుంచి రోడ్డు విస్తరణకు సర్వే చేస్తున్నారు. ఇటీవల కార్పొరేషన్ కమిషనర్ నరసింహప్రసాద్,


సిబ్బందికి సూచనలిస్తున్న ఏసీపీ నాగేంద్ర

జిల్లా ప్రధాన న్యాయమూర్తితో రోడ్డు విస్తరణపై చర్చించారు. ప్రస్తుతం ఉన్న జిల్లా న్యాయస్థానాల సముదాయం ప్రహరీ రోడ్డు విస్తరణలో తీసేయడంపై చర్చించారు. ఇక అక్కడి నుంచి రైల్వే, వక్ఫ్‌బోర్డు, దేవాదాయ శాఖ, పీసీఆర్ పాఠశాలలకు చెందిన స్థలాలు ప్రభుత్వానికి చెందినవి కావడంతో విస్తరణకు ఆయా సంస్థలు ఎలాంటి అభ్యంతరం చెప్పకపోవడంతో మార్కింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయి. జిల్లా కోర్టు నుంచి హై రోడ్డు, వేలూరు రోడ్డు, గిరింపేట, దుర్గమ్మ ఆలయం, పీవీకేఎన్ కళాశాల, కలెక్టరేట్ కూడలి వరకు సర్వే చేస్తున్నారు. వంద అడుగులకు రోడ్డును విస్తరించాల్సి ఉండగా కొన్ని చోట్ల రోడ్డు 50 అడుగులు, మరికొన్ని చోట్ల 80 అడుగుల వరకు రోడ్డు ఉంది.

**పరిహారం ఉండదా..?**

కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్డు విస్తరించేప్పుడు టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్) బాండ్లను భవన యజమానులకు ఇస్తున్నారు. ఇది కోల్పోయిన స్థలం, భవనం విలువను సూచించే బాండ్లుగా పరిగణిస్తారు. పక్కనున్న భవన యజమానులకు దీన్ని విక్రయించుకోవడం, బ్యాంకుల్లో తనఖా పెట్టుకోవడం లాంటి చట్టపరమైన ఆస్తి బదిలీ చేసినట్టుగానే టీడీఆర్ బాండ్లను ఉపయోగించవచ్చు. పరిహారం ఇవ్వడంపై పాలకులు సముఖంగా లేరని ప్రాథమికంగా తెలుస్తోంది.


పీసీఆర్ ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడ వద్ద మార్కింగ్ చేస్తున్న కార్పొరేషన్ యంత్రాంగం

**త్వరలోనే సర్వే పూర్తి..**

హై రోడ్డు విస్తరణపై ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారుల ఆదేశాలపై ముందుకు వెళుతున్నాం. ఇప్పటికే సర్వే ప్రారంభమైంది. మార్కింగ్ పనులు కూడా చకచకా జరుగుతున్నాయి. 20 రోజుల్లో కట్టమంచి అండర్ బ్రిడ్జి నుంచి కలెక్టరేట్ కూడలి వరకు సర్వే పూర్తవుతుంది. ఆపై అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటాం.

– నాగేంద్ర, ఏసీపీ, చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్

## మునిసిపల్ గ్రీవెన్స్‌పై నిర్లక్ష్యం వద్దు


వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి అందే వినతులపై నిర్లక్ష్యంగా ఉండొద్దని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల నుంచి అందే ప్రతీ ఒక్క వినతులు, ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో విచారించి త్వరగా పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. ఆర్థిక అంశాలతో ముడిపడ్డ వాటిని ప్రాధాన్యత ఆధారంగా పూర్తి చేయాలన్నారు. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులు, వినతులను విచారించి వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాద్, మునిసిపల్ ఇంజినీరు వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

## లంచం అడిగితే చర్యలు తప్పవు


వీఆర్‌ఓల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

గుడిపాల: చేయి తడిపితేనే మ్యుటేషన్... లేదంటే టెన్షన్ అన్న శీర్షిక సోమవారం సాక్షి దినపత్రికలో ప్రచురితం అయ్యింది. దీంతో స్పందించిన తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. మ్యుటేషన్ పేరుతో ఎవరైనా లంచాలు అడిగినట్లయితే వారిపై ప్రమశిక్షణా చర్యలు తప్పవన్నారు. పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్ ఫైళ్లను వెంటనే తమ వద్ద ఉంచాలని చెప్పారు. ఎక్కడ కూడా రైతుల వద్ద లంచాలు అడిగినట్లు తమ దృష్టికి వస్తే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు సమస్యలు ఉన్నట్లయితే నేరుగా కార్యాలయంలో తనను సంప్రదించాలని ఆయన కోరారు.

## జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా అవగాహన


ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

గుడిపాల: జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఇందిరా క్రాంతి ఏపీఎం సుధారాణి అన్నారు. జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా సోమవారం మండల సమాఖ్యలో మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ గ్రామ సమాఖ్య పరిధిలో జెండర్ హింసా కార్యక్రమాలు, బాల్యవివాహాలు, రక్తహీనత, బాలికా విద్య మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు లోకనాథరెడ్డి పాల్గొన్నారు.

## రైతుల కోసమే ప్రధానమంత్రి ఫసల్ బీమా


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని రైతులకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ విద్యాధరి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులకు ఆర్థిక సహాయం అందించేందుకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం అమలు చేస్తున్నారన్నారు. ఈ పథకాన్ని క్షేత్రస్థాయిలో అర్హులైన రైతులందరూ తప్పనిసరిగా సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. సంబంధిత పంటలను సాగు చేస్తూ నిర్ణీత సమయంలో ప్రీమియం చెల్లించి పేర్లు నమోదు చేసుకునే కౌలు రైతులు, రైతులు అర్హులన్నారు. ఈ పథకానికి సచివాలయం, సీఎస్‌సీ, పోస్టాఫీసుల్లో ప్రీమియం చెల్లించవచ్చని తెలిపారు. ప్రీమియం తీసుకునే విషయంలో దళారులను నమ్మి మోసపోకూడదన్నారు. వాతావరణ అంశాలను దృష్టిలో పెట్టుకుని బీమా పరిహారం లెక్కిస్తారన్నారు. బీమా చేసిన పంట వివరాలు ఈ పంటలో సక్రమంగా నమోదు అయ్యిందో లేదో రైతులు సరి చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు మురళీకృష్ణ, మధుసూదన్‌రెడ్డి, ప్రభాకర్, ఆర్‌డీవో శ్రీనివాసులు, సీపీవో సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

## సారా స్వాధీనం: వ్యక్తి అరెస్టు

గుడిపాల: సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని ఒకరిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ తెలిపారు. మండలంలోని 197రామాపురం అటవీ ప్రాంతంలో సోమవారం దాడులు నిర్వహించారు. అక్కడ సోమశేఖర్(30) వద్ద సారా ప్యాకెట్లు ఉండడంతో అరెస్ట్ చేశామన్నారు. ఆయనకు నాటుసారా తయారు చేసి ఇస్తున్న అమరనాథ్, సురేష్ వద్ద ఉన్న 5 డ్రమ్ముల్లో వెయ్యి లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశామన్నారు. అమరనాథ్, సురేష్‌పై చిత్తూరు అర్బన్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



## అందరూ చూస్తుండగా.. చెరువులో దూకి ఆత్మహత్య


మృతి చెందిన విజయభాస్కర్

చిత్తూరు అర్బన్: నగరంలోని గంగినేని చెరువులో దూకి విజయభాస్కర్ (38) అనే యువకుడు సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. గిరింపేటలోని గొడుగుమూరుకు చెందిన గోవిందరెడ్డి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. గత నెలలో అనారోగ్యంతో ఆయన మృతి చెందాడు. ఆయన సతీమణి సైతం అనారోగ్యంతో మంచంపట్టారు. వారి కుమారుడు విజయభాస్కర్‌ను ఈ ఘటనలు కలిచివేశాయి. గత రెండు వారాలుగా విజయభాస్కర్ మానసిక పరిస్థితి బాగా క్షీణించింది. దీంతో సోమవారం సాయంత్రం అందరూ చూస్తుండగా పరుగెత్తుకుంటూ వచ్చి గంగినేనిచెరువులో దూకేశాడు. హుటాహుటిన స్థానికులు ఇతడిని రక్షించడానికి చెరువులోకి దూకినా ప్రయోజనం లేకపోయింది. కొద్దిసేపటి తరువాత అగ్నిమాపక సిబ్బంది వచ్చి విజయభాస్కర్ మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

# యాంటీబయాటిక్స్



- విచ్చలవిడిగా యాంటీబయాటిక్స్ వాడకం
- ప్రిస్క్రిప్షన్ లేకుండానే అమ్మకాలు
- రోగనిరోధక శక్తిపై ప్రభావం
- వినియోగంపై అవగాహన సదస్సులు

చలికాలంలో వృద్ధులకు ఒళ్లునొప్పులు, కీళ్లనొప్పులు అధికం. ఈ క్రమంలో కొందరు బాధితులు నేరుగా మెడికల్ షాపులకు వెళ్లి మందులు కొనుగోలు చేస్తుంటారు. అయితే షాపు నిర్వాహకులు యాంటీబయాటిక్స్ ఇవ్వడంతో వాటిని వేసుకుని ఉపశమనం పొందుతుంటారు. ఇలా యాంటీబయాటిక్స్ అతిగా వాడిన వారికి భవిష్యత్‌లో పలు అనారోగ్య సమస్యలు వస్తాయంటున్నారు నిపుణులు. జలుబు, దగ్గుతోపాటు ఎలాంటి రోగానికైనా డాక్టర్ సూచనల మేరకు వాడాలని సూచిస్తున్నారు.

కాణిపాకం: చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో 92 ప్రైవేటు ఆస్పత్రులు, ఆర్ఎంపీ క్లినిక్‌లు 47, మెడికల్ షాపులు 172 దాకా ఉన్నాయి. వీటిలో చాలా వరకు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయి. ఇష్టానుసారంగా మందులు విక్రయిస్తూ అమాయక ప్రజల ప్రాణాలకు ముప్పు తెప్పిస్తున్నారు. ముఖ్యంగా మందులు, మాత్రలు ఇచ్చే విషయంలో కనీస ప్రమాణాలు పాటించడం లేదు. కేవలం ఆదాయం కోసమే పరితపిస్తున్నారు. బ్యాక్టీరియా, వైరస్ మనిషి శరీరంలోకి ప్రవేశించి దాడి చేయడంతో వివిధ వ్యాధులు వస్తుంటాయి. ఆస్పత్రులకు వెళితే వైద్యులు పరీక్షించి ఏ వ్యాధో గుర్తించి సంబంధించిన యాంటిబయటిక్స్ రాస్తుంటారు. వారు సూచించిన మేరకు రోగి వాడితే ఆరోగ్యానికి ఏమీ కాదు. కానీ కొందరు వైద్యులు సూచించిన దానికంటే మించి వినియోగిస్తుంటారు. ఇలా కొందరు వ్యాధి తగ్గిపోయిన తరువాత మళ్లీ అదే వ్యాధి తిరగబెడితే, పాత చీటీని తీసుకెళ్లి కొనుగోలు చేసుకుని వాడుతుంటారు. దీంతో శరీరంలోని బ్యాక్టీరియా ఆ మందులకు తగ్గకపోవడంతోపాటు ఇన్ఫెక్షన్ సోకి ప్రాణాంతకంగా మారుతుందంటున్నారు వైద్యులు.

**యాంటీబయాటిక్స్‌పై ఆంక్షలు**

ప్రపంచ ఆరోగ్య సంస్థ యాంటిబయాటిక్స్ వినియోగంపై పలు ఆంక్షలు విధించింది. అత్యధికంగా వాడటం వల్ల శరీరంలోని బ్యాక్టీరియా వైరస్ ఆ మందులకు లొంగక మళ్లీ విస్తృతంగా రోగాలు వస్తాయని పేర్కొంటున్నారు. దీంతో యాంటీబయాటిక్స్ అవగాహన కల్పించాలని ఆదేశాలు జారీ కావడంతో వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, వైద్య సిబ్బందితో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రైతులు, పశువుల కాపరులకు పరీక్షలు నిర్వహించడంతోపాటు, ర్యాలీలు చేపడుతున్నారు.

**ఆర్ఎంపీలకు హెచ్చరిక**

ఆర్ఎంపీలు కూడా వారి వద్దకు వెళ్లిన రోగులకు విచ్చలవిడిగా యాంటిబయాటిక్స్ మందులను అంటగడుతున్నారు. ఇటీవలే వైద్యశాఖ ఆధ్వర్యంలో వారికి హెచ్చరికలు కూడా జారీ చేశారు. అంతేకాకుండా ప్రిస్క్రిప్షన్స్ కూడా రాయకూడదని, ఇన్‌పేషెంట్స్ వైద్యం చేయకూడదని పేర్కొన్నారు.

**ప్రైవేట్లో ఎక్కువ**

ప్రభుత్వ ఆస్పత్రుల్లో యాంటీబయాటిక్స్ వినియోగం తక్కువే అని చెప్పవచ్చు. ప్రైవేటు ఆస్పత్రులు, ఆర్ఎంపీలు మాత్రం విచ్చలవిడిగా యాంటీబయాటిక్స్ ఇస్తున్నట్లు సమాచారం. వాస్తవానికి రోగికి ఇచ్చే మొత్తం మందుల్లో యాంటీబయాటిక్స్ 10 శాతం దాటొద్దన్నది నిబంధన. కానీ కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో ఇవి కానరావడం లేదు.

**ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్మకాలు**

చిన్నచిన్న అనారోగ్య సమస్యలకు గురైనప్పుడు ఎక్కువ మంది సొంత వైద్యమే చేసుకుంటారు. కొందరు ఏకంగా మెడికల్ షాపులకు వెళ్లి యాంటీబయాటిక్స్ కొనుగోలు చేసుకుని వాడుతుంటారు. అనారోగ్యానికి సంబంధించిన లక్షణాలు తెలపగానే మెడికల్ షాపుల వారు ఈ యాంటీబయాటిక్స్ ఇస్తుంటారు. వాస్తవానికి ప్రిస్క్రిప్షన్ లేనిదే మందులు ఇవ్వకూడదు. ఇది ఏమేరకు ఇస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో వైద్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



**తగ్గిస్తే ఆరోగ్యానికి మంచిది**

యాంటీబయోటిక్స్ వినియోగం తగ్గించాలి. కొన్నిచోట్ల ఇష్టానుసారంగా వాడుతున్నారు. వాటి వల్ల దుష్ప్రభావాలు అధికంగా ఉంటాయి. ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది. డాక్టర్ల సూచన మేరకే యాంటీబయాటిక్స్ వాడాలి. రోగ నిరోధక శక్తిపై ప్రభావం చూపుతాయి. వాటి వాడకం వల్ల కలిగే నష్టాలపై పీహెచ్‌సీలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– ప్రభావతిదేవి, డీఎంహెచ్‌ఓ, చిత్తూరు

### బాలికా విద్య సమాజానికి వెలుగు

బంగారుపాళెం: ఆడపిల్లల చదువు సమాజానికి వెలుగు నింపుతుందని ఏఎస్ఐ వళ్లెమ్మ అన్నారు. స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహంలో సోమవారం సీఐ శ్రీనివాసుల ఆధ్వర్యంలో బాలికా చట్టాలు-బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ, సమాజంలో ఆడపిల్లలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని తెలిపారు. మగపిల్లలతో సమానంగా పోటీపడుతున్నారని చెప్పారు. కొందరు తల్లిదండ్రులు ఆడపిల్లలకు చిన్న వయసులోనే చదువులు మాన్పించి వివాహాలు చేస్తున్నారన్నారు. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను గురించి వివరించారు. ఆడపిల్లలు బయట హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్నారని వారు జాగ్రత్తగా నడుచుకోవాలని సూచించారు. బాలికలు బయటకు వెళ్లినప్పుడు అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆడపిల్లలతో ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, ఇబ్బందులు పెట్టినా వెంటనే పోలీస్ నంబర్ 112 ఫోన్ చేయాలని సూచించారు. హాస్టళ్లలో బాలికలకు గట్టిభద్రత కల్పించాలిన బాధ్యత వార్డెన్లపై ఉందన్నారు. హాస్టల్ విద్యార్థులకు ఎటువంటి సమస్యలు ఎదురైనా పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వార్డెన్ గీత, సిబ్బంది పాల్గొన్నారు.


వసతి గృహంలో బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ మల్లెమ్మ